సమస్యలపై నిలదీత


మాట్లాడుతున్న ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ


హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

కర్నూలు(రూరల్):నగరంలోని మండల పరిషత్ కా ర్యాలయంలో సోమవారం ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన, కర్నూలు మండల ఎంపీడీఓ జి.రఘునాథ్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా మండల స్థాయి అధికారులు పాల్గొన్నా రు.మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రా మాల్లో నెల కొన్నసమస్యలపై అధికారులను నిలదీశారు.

- ఎంపీడీఓ రఘునాథ్ మాట్లాడుతూ.. మైనర్ ఇరిగేషన్, విద్యుత్, పశుసంవర్ధక శాఖ, పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రగతి నివేదికలు సమర్పించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. నివేదికలు ఇవ్వని వారిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. అలాగే తల్లిపాల వారోత్సవాలు, జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాలను ఆ శాఖ అధికారులు ఎంపీడీఓ కార్యాలయానికి తెలపకుండా నిర్వహిస్తున్నారన్నారు.
- బి.తాండ్రపాడులో ఐరన్ విద్యుత్ స్తంభాలను మార్చడంలో లైన్‌మెన్ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, ఒకరి వద్ద డబ్బులు తీసుకొని వారి ఇంటి వద్ద ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని మార్పుచేసి, కాలనీలో మిగతా వారిని ఇబ్బందులకు గూరిచేస్తున్నాడని తగని చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు కురువ మద్దిలేటి ఏఈ దృష్టికి తెచ్చారు.
- దిన్నెదేవరపాడు సచివాలయం ఎదురుగా ఆర్ అండ్‌బీ రోడ్డుపై వంతెన కూలిపోవడానికి సిద్ధంగా ఉందని సర్పంచ్ మాధవస్వామి ఏఈ నాగస్వామికి తెలియజేశారు.
- ఉల్చాల సమీపంలో తుమ్మల వాగుపై వంతెన నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయని సర్పంచ్ విద్యాసాగర్ సభ దృష్టి తెచ్చారు.
- ఇ.తాండ్రపాడులో రెండు రైతు సేవా కేంద్రాలు నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదని, అలాగే గ్రామ సచివాలయం పనులు 90 శాతం పూర్తయ్యాయని, మిగతా పనులు పూర్తిచేసి భవనాలను ప్రారంభించాలని సర్పంచ్ బాలపీర సమస్యను లేవనెత్తారు
- ఇ.తాండ్రపాడు సమీపాన ఎల్లమ్మ ఆలయం నుంచి బసాపురం, బైరవాపురం గ్రామాల మీదుగా అలంపూర్‌కు వెళ్లే 3 కి.మీ ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారడంతో బస్సు సౌకర్యం నిలిపివేశారని, రోడ్డును బాగు చేసి సమస్య పరిష్కరించాలని సభ దృష్టికి తెచ్చారు.
- గార్గేయపురం ఎస్సీ కాలనీ (మాలపేట)లో డ్రైనేజీ నిర్మించి, తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎంపీటీసీ జ్యోతిలత, సర్పంచ్ సోమేశ్వరమ్మ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రంగస్వామిని కోరారు.

సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని, గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. అదేవిధంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు.

గౌరవ వేతనం మంజూరు చేయాలి

ఎంపీటీసీ సభ్యులు మండల సర్వసభ్య సమావేశాలకే పరిమితమనే భావనను కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న 15 నెలల గౌరవ వేతనాన్ని (నెలకు రూ.3 వేలు) మంజూరు చేయడంలేదని, తమ సమస్యలు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు మండిపడ్డారు. గౌరవ వేతనాలు ఎప్పుడిస్తారని కర్నూలు ఎంపీడీవో రఘునాథ్‌ను ఎంపీటీసీలు ప్రశ్నించారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలచే ఎన్నికైన ప్రజా ప్రతినిధులను విస్మరిస్తోందని వైస్ ఎంపీపీ నెహమ్యా, గొందిపర్ల ఎంపీటీసీ క్రిష్ణవేణి, గార్గేయపురం ఎంపీటీసీ జ్యోతిలత ఉల్చాల గ్రామ సర్పంచ్ విద్యాసాగర్ మండిపడ్డారు.

7న శాస్త్రీయ నృత్య పోటీలు

కర్నూలు కల్చరల్: శాంతి తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో నాట్యరత్న హెచ్.వెంకటస్వామి సంస్మరణ సభ సందర్భంగా ఈ నెల 7వ తేదీ సాయంత్రం 6 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షులు కృష్ణమూర్తి పేర్కొన్నారు. 10 - 20 ఏళ్ల వయసున్న యువతీ యువకులు మాత్రమే పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. శాస్త్రీయ నృత్యాన్ని సోలో డ్యాన్స్‌లో 8 నిమిషాల వ్యవధిలో ప్రదర్శించాలన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఈనెల 7వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా 91004 37765 నంబర్‌కు వాట్సాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

బుక్ కీపర్ మృతికి నివాళి

సి.బెళగల్: పోలకల్‌కి చెందిన బుక్ కీపర్ అరుణమ్మ ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం నివాళులర్పించారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి గ్రామానికి చేరుకుని అరుణమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి భర్త వెంకటేశ్వరరెడ్డిని ఓదార్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు నరసింహుడు, మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, పులిరాజు,బాలరాజు తదితరులు ఉన్నారు. మండల వెలుగు ఎన్యూమరేటర్స్ సంఘం సభ్యులు ఏపీఎం రామేశ్వర్‌తో కలిసి బుక్‌కీపర్ అంత్యక్రియ ఖర్చులకు నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు.

క్లుప్తంగా

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం


మాట్లాడుతున్న డీఈఓ శామ్యూల్ పాల్

కల్లూరు: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని డీఈఓ శామ్యూల్ పాల్ అన్నారు. సోమవారం బస్తిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు ఎస్.పుష్పరాజ్యం పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఇందుకు డీఈఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు ఆమెను ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం ఎస్.అబ్దుల్ గఫూర్, పాన్నాపురం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఐజయ్య, ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీలో అలసత్వం తగదు


పాణ్యంలో పింఛన్ పంపిణీ చేస్తున్న డీపీఓ లలితాబాయి

పాణ్యం: పింఛన్ పంపిణీ సక్రమంగా చేయాలని,ఇందులో అలసత్వం తగదని నంద్యాల జిల్లా డీపీఓ లలితాబాయి అన్నారు. సోమవా రం పాణ్యంలో పింఛన్‌ల పంపిణీ సరళిని పరిశీలించి పలువురికి పింఛన్‌లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 6,246 మంది పింఛన్‌దారులు ఉండగా 5641 మందికి సొమ్ము అందజేశామని చెప్పారు. తొలిరోజు 90.31శాతం పూర్తి చేశామన్నారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఈఓ ఆనందరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులు పునఃప్రారంభం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

పాణ్యం: మండలంలోని నెరవాడ మెట్ట–పుట్టాలమ్మ వరకు మూడు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు పనులను సోమవారం పునఃప్రాంభమయ్యాయి. పీఐయూ డీఈఈ మల్లికార్జున మాట్లాడుతూ రూ.2.65కోట్లు మంజురయ్యా యని చెప్పారు. గతంలో మెట్ట నుంచి గ్రామం వరకు రోడ్డు వేశామని, ప్రస్తుతం గ్రామం నుంచి పుట్టాలమ్మ వరకు రోడ్డు వేయనున్నట్లు తెలిపారు. గతంలో నాటి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించగా.. ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయి. ఏఈ సతీష్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, శివారెడ్డి రాంభూపాల్ రెడ్డి, సుధాకరెడ్డి పాల్గొన్నారు.

కారు, ట్రాక్టరు ఢీ


ప్రమాదంలో ధ్వంసమైన కారు

కర్నూలు (రూరల్): నగర శివారులోని గార్గేయపురం చెరువు మలుపు వద్ద సోమవారం ఆత్మకూరు నుంచి కర్నూలుకు వస్తున్న కారు కర్నూలు నుంచి ఆత్మకూరుకు వెళుతున్న ట్రాక్టరు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తి ఎగిరి రోడ్డుపై పడటంతో గాయలపాలయ్యాడు. రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొని రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. సమాచారం అందుకున్న తాలుకా అర్బన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాలను తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

స్వర్ణకారుడి దారుణ హత్య

కర్నూలు: స్థానిక పాతబస్తీలోని రాధాకృష్ణ టాకీస్ సమీపంలో మసీదు వద్ద బంగారు నగల తయారీదారుడు ఇజ్రార్ అహ్మద్ (45) దారుణ హత్యకు గురయ్యాడు. ఈయన ప్రస్తుతం కొత్తపేటలో నివాసముంటున్నాడు. కొండారెడ్డిబురుజు వద్ద ఉన్న స్వర్ణలోక్ కాంప్లెక్స్‌లో 29వ నంబర్ బంగారు దుకాణంలో నగలు తయారు చేస్తాడు. సోమవారం సాయంత్రం 7 గంటలకు మసీదులో నమాజు ముగించుకుని వస్తుండగా గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడి చేసి పరారయ్యారు. స్థానికులు అతన్ని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పాతబస్తీలోని గనిగల్లీలో నివాసముండేటప్పుడు ఆ ప్రాంతానికి చెందిన కొందరితో ఇజ్రార్‌కు విభేదాలు ఉన్నట్లు సమాచారం. ఒకటో పట్టణ సీఐ సిబ్బందితో అక్కడికి చేరుకుని హత్యకు గల కారణాలపై విచారిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్దతు ధర కోసం రోడ్డెక్కిన ఉల్లి రైతులు

- ఉల్లిగడ్డలను రోడ్డుపై పారబోసి రాస్తారోకో
- రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే


రోడ్డుపై ఉల్లిగడ్డలను పారబోసి రాస్తారోకో చేస్తున్న రైతులు, సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్: ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ రైతులు, సీపీఐ నాయకులతో కలిసి సోమవారం కోడుమూరులోని కోట్ల సర్కిల్‌లో.. తాము పండించిన ఉల్లిగడ్డలను రోడ్డుపై పారబోసి రాస్తారోకో, ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు క్రిష్ణ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిన దిన గండంగా మారిపోయిందని విమర్శించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు లేనప్పటికీ అతివృష్టి, అనావృష్టిలను తట్టుకుని పంటలు పండిస్తే దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పించలేని పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వముందని ఆయన ధ్వజమెత్తారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి ఉల్లి సాగు చేసిన రైతులకు ప్రభుత్వం కనీసం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో ఉల్లి పంటలను కోయలేక రైతులు పొలాల్లోనే వదిలేసుకుంటున్నారని వాపోయారు. కంటి తుడుపు చర్యగా ప్రభుత్వం ప్రకటించిన క్వింటాల్ ఉల్లికి రూ.1200 మద్దతు ధర రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదని, కనీసం పంటకు పెట్టిన సగం పెట్టుబడులకు కూడా సరిపోవని క్రిష్ణ ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి క్వింటాల్ ఉల్లికి రూ.3 వేల మద్దతు ధర కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక వ్యవసాయంలో తీవ్ర నష్టాలతో అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, రాష్ట్రంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యల పాపం కూటమి ప్రభుత్వానిదేనని సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు రాజు, శేషుకుమార్ విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ, రైతు సంఘం నాయకులు రాముడు, ఉచ్చీరప్ప, జయరాముడు, నర్సప్ప, రామచంద్రుడు, రంగడు, మద్దిలేటి, మాల దాసు, చంద్ర, రామాంజినేయులు, విశ్వనాథ్, బజారి, వెంకటేష్, రమేష్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి పంటకు మద్దతు కల్పించాలి

ఓర్వకల్లు: ఉల్లి పంటకు కనీస మద్దరు ధర రూ.3 వేలు కల్పించాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో రైతు సంఘం మండల కార్యదర్శి మధుసూదన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న ఆధ్వర్యంలో తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. మండలంలో చాలా మంది రైతులు వర్షాధారం ఆధారంగా.. ఉల్లిని ప్రధాన పంటగా సాగుచేస్తున్నారని చెప్పారు. తీరా దిగుబడి చేతికొచ్చిన సమయంలో మార్కెట్లో క్వింటా ధర రూ.200 నుంచి రూ.500 వరకు ధర పలుకుతుందని దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం క్వింటాకు కనీస మద్దతు ధర రూ.3 వేలు చెల్లించి కొనుగోలు చేయాలని కోరారు. ఆంజనేయులు, బాషా, శ్రీనివాసులు, హరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

కోడుమూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు కె.నాగలాపురం ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆ వ్యక్తి ఎక్కడి నుంచి వచ్చాడో తెలియదు గానీ కె.నాగలాపురం నుంచి కర్నూలుకు వెళ్లే రోడ్డుపై గత ఆగస్టు 26న గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రగాయాలతో పడి ఉన్నాడు. విషయం తెలుసుకున్న కె.నాగలాపురం పోలీసులు క్షతగాత్రుడిని అదేరోజు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఆ వ్యక్తి కోమాలోకి వెళ్లినట్లు నిర్ధారించి వైద్యులు చికిత్స అందిస్తుండగా కోలుకోలేక సోమవారం మృతిచెందాడు. మృతిచెందిన వ్యక్తికి 35 – 40 ఏళ్ల వయస్సు ఉంటుందని, ఆ వ్యక్తి తెచ్చుకున్న బ్యాగులో ఓ దుప్పటి, బట్టలున్నాయని, ఆచూకీ తెలిసిన వారు కర్నూలు రూరల్ సీఐ సెల్ 91211 01065, కె.నాగలాపురం ఎస్‌ఐ 91211 01068 నంబర్లకు సమాచారమివ్వాలని ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి కోరారు.

వ్యక్తి దుర్మరణం

పాణ్యం: మండలంలోని శాంతిరామ్ ఆసుపత్రి సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. హైవే పోలీసులు, సిబ్బంది తెలిపిన వివరాల మేరకు మృతుడి వయస్సు సుమారు 40 ఉంటుందని, తెల్లటి టీషర్టు, సిమెంట్ కలర్ ప్యాంట్ ధరించాడని, గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెంది ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. అయితే ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

గణనాథుడి సేవలో కాటసాని


గణనాథునిడి సేవలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి తదితరులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 35వ వార్డులోని సిద్ధిబుద్ధి వరసిద్ధి వినాయకునికి వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్పొరేటర్ సాన శ్రీనివాసులు, నాయకులు మిద్దూరు శ్రీనివాసులు, జానకమ్మ, కాటసాని హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


కాటసాని రాంభూపాల్‌రెడ్డి, శివనరసింహారెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కల్లూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయిలో వివిధ అనుబంధ విభాగాల్లో పదవులు పొందిన వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. పార్టీలో బూత్ కమిటీ విభాగం జాయింట్ సెక్రటరీగా నియమితులైన కొంగనపాడు గ్రామానికి చెందిన కేశవరెడ్డి సోమవారం రాత్రి కాటసాని రాంభూపాల్‌రెడ్డి, యువ నాయకుడు కాటసాని శివనరసింహారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి, గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారందరికీ పదవులు లభిస్తాయని చెప్పారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు ఆరు అర్జీలు


సి.బెళగల్‌లో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ వెంకటలక్ష్మి నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు (పీజీఆర్‌ఎస్)కు మండల రైతుల నుంచి ఆరు అర్జీలు వచ్చాయి. ఆయా శాఖలకు చెందిన మండల అధికారులు, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె పీజీఆర్‌ఎస్‌ను నిర్వహించగా, సి.బెళగల్, పోలకల్, బురాన్‌దొడ్డి గ్రామాలకు చెందిన నలుగురు రైతులు భూముల ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు ఇచ్చారు. అదేవిధంగా సంగాల, కంబదహాల్ గ్రామాలకు చెందిన ఇద్దరు రైతులు భూముల కొలతలు నిర్వహించి, సబ్‌డివిజన్ చేయాలని అర్జీలో కోరారు. అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ రైతులతో అన్నారు. మండల సర్వేయర్ నాగభూషణం, ఆర్‌ఐ తరుణ్, వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు. అదేవిధంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాణెమ్మ సైతం పీజీఆర్‌ఎస్‌ను నిర్వహించగా, డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు గోనేనాయక్, వెంకటప్రకాష్ ఎంఈఓ జ్యోతి, తదితరులు హాజరయ్యారు.

నీట మునిగిన పంటల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్


ముంపునకు గురైన పంటల వివరాలను సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సి.బెళగల్: మండలంలోని బ్రాహ్మణదొడ్డి రెవెన్యూ గ్రామం దగ్గర చెరువు నీటి ముంపునకు గురైన పంటలను వ్యవసాయ సిబ్బంది పరిశీలించారు. బ్రాహ్మణదొడ్డి గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువు కొట్టాల గ్రామం దగ్గర దాదాపు 30 ఎకరాల విస్తీర్ణంలో పంటలు చెరువు నీటిలో ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీనిపై 'సాక్షి' దినపత్రికలో సోమవారం 'నీట మునిగిన పంటలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన మండల వ్యవసాయ అధికారుల ఆదేశాల మేరకు ఎంపీఈఓ భాస్కర్ సోమవారం గ్రామానికి చేరుకుని నీట మునిగిన పంటలను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి పంట రకం, సాగు విస్తీర్ణం తదితర వివరాలు నమోదు చేసుకున్నారు. పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఎంపీఈఓ తెలిపారు.

కుక్కలు బాబోయ్!


గడివేములలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు

గడివేముల: మండల కేంద్రంలో కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ జనంపై దాడికి దిగుతున్నాయి. నడిచి వెళ్తున్న వాళ్ల కాళ్ల పిక్కలను కరుస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబెలిత్తిపోతున్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వీధి కుక్కల సంచారం ఎక్కువయ్యాయి. దీంతో కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు వీధి కుక్కల నియంత్రణ చేపట్టి మండల ప్రజలు కోరుతున్నారు.

దండం పెడతా.. భూ సమస్య పరిష్కరించమ్మా!

- పీజీఆర్‌ఎస్‌కు వెల్లువలా రెవెన్యూ సమస్యలపై వినతులు
- కళ్లరిగేలా తిరిగినా ఎవరూ పట్టించుకోవడంలేదని బాధితుల ఆవేదన
- రెవెన్యూ సదస్సులు, గ్రామసభల్లో వినతులు ఇచ్చినా పరిష్కారం శూన్యం
- నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించిన కలెక్టర్ పి.రంజిత్‌బాషా

జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్యకు దండం పెడుతున్న ఈ వృద్ధుడి పేరు ఉరుకుందు. నందవరం మండలం మిట్టసోంపురం వాసి. ఇతనికి వివిధ సర్వే నంబర్లలో 10 ఎకరాల పొలం ఉండేది. ఇటీవల భాగ పరిష్కారాల్లో భాగంగా ఆయన అనుమతి లేకుండా రెవెన్యూ అధికారులు నాలుగు ఎకరాల పొలాన్ని సోదరి పేరిట ఆన్‌లైన్ చేశారు. దీంతో సుమారుగా ఏడాది కాలంగా నందవరం తహసీల్దార్, కలెక్టరేట్, ఆదోని సబ్ డివిజన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోతోంది. ఏదైనా ఉంటే మీ అక్కతో మాట్లాడుకోవాలని చెబుతున్నారని వాపోయాడు. మరోవైపు ఉరుకుందు సమస్యను ఆర్‌ఓఆర్ కోర్టుకు పంపామని, ఆయన ఏమైనా చెప్పుకోవాలనుకుంటే అక్కడకు వెళ్లాలని అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఇలా ప్రతీ సోమవారం కలెక్టరేట్, సబ్‌డివిజన్, తహసీల్దార్ కార్యాలయాల్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూ సమస్యల పరిష్కారం కోసం అన్నదాతలు తిండీ తిప్పలు మాని, పనులు వదుకొని వస్తున్నా పరిష్కారం దొరకని పరిస్థితి.


తన సమస్యను పరిష్కరించాలని జేసీ డాక్టర్ బి.నవ్యకు దండం పెడుతున్న వృద్ధుడు ఉరుకుందు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాలో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు భారీ స్థాయిలో ప్రజలు వస్తుంటారు. జిల్లా నలుమూలల నుంచి ఎంతో వ్యయ ప్రయాసాలకొర్చి కలెక్టరేట్‌ను ఆశ్రయిస్తున్నారు. ఎంత కష్టమైనా సమస్యకు పరిష్కారం లభిస్తే చాలన్న రీతిలో వృద్ధుల నుంచి యువకుల వరకు తరలివస్తున్నారు. వచ్చే వారిలో ఎక్కువగా 50 ఏళ్లకు పైగా ఉన్న వారే ఉంటారు. వీరిలో చాలా మందికి బీపీ, షుగర్‌తోపాటు ఒళ్లు, కాళ్ల నొప్పులు ఉన్నా ఎన్నో ఆశలతో కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలు ఇస్తారు. అయితే వాటి పరిష్కారాలపై క్షేత్రస్థాయిలో వేరుగా.. అధికారిక లెక్కల్లో మరో రకంగా ఉంటోంది. కాగా, వచ్చే సమస్యల్లో ఎక్కువగా రెవెన్యూ , సర్వే డిపార్టుమెంట్‌లకు సంబంధించినవే ఉంటున్నాయి. అయితే అర్జీ ఇచ్చిన వారితో మాట్లాడితే పరిష్కారం అయినట్లు అధికారులు రికార్డుల్లో చూపుతున్నారు. ఎవరైనా ఫిర్యాదు ఇస్తే వారిని కలసి ఫొటో తీసుకొని సమస్యను విని మళ్లీ కలుస్తామని చెప్పి చాలా మంది అధికారులు పరిష్కారమైనట్లు వారి లాగిన్లలో చూపుతుండటం గమనార్హం. కొందరైతే కలెక్టర్, వారి శాఖల ఉన్నతాధికారుల భయంతో కూడా సమస్యకు ఎలాంటి పరిష్కారం చూపకపోయినా చూపినట్లు లాగిన్‌లో ఎంట్రీ చేస్తుండడంతో బాధితులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ప్రజల సమస్యలను సీరియస్‌గా తీసుకోవాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యల పరిష్కారంపై సీరియస్‌గా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)లో కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను పరిష్కరించే సమయంలో అర్జీదారుడితో మాట్లాడితే మంచి ఫలితం ఉంటుందన్నారు. పీజీఆర్‌ఎస్ లాగిన్లో పరిష్కారం చేసిన అర్జీల నాణ్యతను ఆడిట్ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ చిరంజీవి పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన సమస్యల్లో కొన్ని..

- లాభాలు ఆర్జిస్తున్న టూరిజం శాఖ హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లు, ఇతర సంస్థలను ప్రైవేటీకరించేందుకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీఓను రద్దు చేయాలని కోరుతూ ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దాదాపుగా 50 ఏళ్ల వయస్సు వచ్చిన ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారందరినీ ప్రైవేట్‌కు అప్పగిస్తే ఉద్యోగ భద్రతకు ముప్పని ఓబులేసు, శ్రీనివాసులు, ఆనంద్‌కుమార్, జయమ్మ విన్నవించారు.
- రెండు కాళ్లు, చేతులు లేకపోక మంచాన పడిన తమ కూతూరు కీర్తనకు రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలని కోరుతూ కర్నూలు నగరంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన యాకమ్మ కలెక్టర్‌ను కోరారు. 100 శాతం వికలత్వం ఉన్నా రూ.6 వేల పెన్షన్ వస్తోందని వాపోయారు.
- క్రీడల కోటలో నకిలీ సర్టిఫికెట్లను జారీ చేసి వ్యాయామ ఉపాధ్యాయుల నియామకాలకు సహరిస్తున్న కర్నూలు జిల్లా అథ్లెటిక్ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మహేంద్ర ఫిర్యాదు చేశాడు. ఆయన కొందరు పీడీలతో కలసి కోటరీ ఏర్పాటు చేసుకొని ఏ మాత్రం క్రీడల అనుభవం లేకున్నా సర్టిఫికెట్లను జారీ చేసి లక్షలకు లక్షలు పొగుచేసుకుంటున్నారని, ఈ నకిలీ సర్టిఫికెట్ల దందాపై విచారణ చేయాలని కలెక్టర్‌ను కోరారు.

ఎవరి ప్రయోజనాల కోసమో మమ్మల్ని బలి చేయొద్దు

- ఏటీసీ క్వార్టర్లను ఖాళీ చేయడానికి సమయం ఇవ్వాలని కోరిన బాధితులు

ప్రస్తుతం ఏ, బీ, సీ క్యాంపు క్వార్టర్లు ఉన్న స్థలాల్లో వాటిని తీసివేసి స్టేడియాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు కట్టేందుకు తమను బలి చేయవద్దని, ఎవరి ప్రయోజనాల కోసమో తమను ఇబ్బందులకు గురి చేయవద్దని కోరుతూ ఆయా క్వార్టర్లలో నివాసం ఉంటున్న కొందరు కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలసి వినతిపత్రం ఇచ్చారు. క్వార్టర్లను ఖాళీ చేయడానికి కొంత సమయం కావాలని, అప్పటి వరకు ఖాళీ చేయించేందుకు ప్రయత్నాలు చేయవద్దని కోరారు.